క్లుప్తంగా

చుడా కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, చుడా చైర్మన్లు

గుడిపాల: చిత్తూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(చుడా) కోసం మంగళవారం చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, చుడా చైర్మన్ హేమలత స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలోని 279 సర్వే నెంబర్‌లో సుమారు 4 ఎకరాల స్థలాన్ని గోశాల కోసం వారంక్రితం జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఇదే స్థలాన్ని పరిశీలించారు. గోశాలకు అనుకూలంగా లేకపోవడంతో చుడా వారు స్థలం కావాలని కోరడంతో వాటిని పరిశీలించారు. చుడా అభివృద్ధి కోసం దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో శ్రీనివాసులు, చుడా చైర్మన్‌లు ఆ స్థలాన్ని పరిశీలించారు. వారితో పాటు తహసీల్దార్ జయంతి పాల్గొన్నారు.

నీటి తొట్టెలు మంజూరు



తొట్టెలో నీరు తాగుతున్న పాడిఆవు

గుడిపాల: మండలంలో పాడి ఆవులకు నీటి సౌకర్యం కోసం నీటి తొట్టెలు మంజూరైనట్లు పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో 37 నీటి తొట్టెలు ఉన్నాయని ఇవికాకుండా కొత్తగా మరో 30 నీటితొట్టెలు మంజూరైందన్నారు. వీటని ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించనున్నట్లు వివరించారు. పాడిపశువుల కోసం ప్రభుత్వం గ్రామాల్లో నీటితొట్టెలను ఏర్పాటు చేసి నీరు నింపుతున్నట్లు తెలిపారు.

చిత్తూరు అభివృద్ధిపై దృష్టి సారించాలి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర అభివృద్ధికి పాలకులు, అధికారులు సహకరించాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ కోర్ కమిటీ సభ్యులు కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను కలిశారు. నగరానికి తాగు నీళ్లు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన అడవిపల్లె రిజర్వాయర్ పనులు, నగరంలో వీధి కుక్కల నియంత్రణ, హై రోడ్డు విస్తరణ, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై చర్చించారు. ప్రాధాన్యత ఆధారంగా త్వరలో పనులు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు తాండవమూర్తి, నాయకులు సత్య, గోపినాయక్, మురళి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'విద్యుత్ అదాలత్'



ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో సమస్యలపై వినతులు అందుకుంటున్న అధికారులు

కార్వేటినగరం: విద్యుత్ వినియోగదారులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు విశ్రాంత న్యాయమూర్తి, విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ మాట్లాడారు. జీడీనెల్లూరు, కార్వేటినగరం, నగరి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన ఈ అదాలత్‌కు 8 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటినిపరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీఓ వినుతశ్రీ

పాలసముద్రం : అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ టీచర్లు నేర్పించాలని సీడీపీఓ వినుతశ్రీ, ఎంఈఓ గిరిజ ఆదేశించారు. మంగళవారం ఎంఆర్‌సీ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ ప్రారంభించారు. సీడీపీఓ, ఎంఈఓ మాట్లాడారు. శిక్షణ ఉద్దేశాలను వివరించారు. శిక్షణానంతరం కేంద్రాల్లో సమర్థవంతంగా విద్యాబోధన చేయాలన్నారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శ్మశానానికి భూమి గుర్తింపు

పాలసముద్రం: మండలంలో శ్మశానం లేని గ్రామాలకు ప్రభుత్వ భూమిని గుర్తించి కేటాయిస్తామని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. తన సిబ్బందితో కలసి తహసీల్దార్ గంగమాంబపురం, నరసింహాపురం పంచాయతీల్లో మంగళవారం పర్యటించారు. శ్మశానానికి ప్రభుత్వ భూమిని గుర్తించి మాట్లాడారు. దీనికి దారి కూడా ఉండేలా చూడాలన్నారు.

దివ్యాంగులకు యూడీఐడీ

- కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- 21 రకాల సేవలు సులువుగా పొందే అవకాశం

గుడిపాల: దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలకు సదరం స్థానంలో యూడీఐడీ(యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీకార్డు)ని అందించనుంది. దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే చేయూత, ఇతర ప్రయోజనాలకు ఇప్పటివరకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. దీనికోసం దివ్యాంగులు గ్రామ సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకుంటే ప్రభుత్వం నిర్దేశించిన వైద్యశిబిరంలో వైద్యులు వైకల్య నిర్ధారణ అనంతరం సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సదరం సర్టిఫికెట్లకు స్వస్తి పలికింది. ఆ స్థానంలో యూడీఐడీని పొందేందుకు స్వావలంబన్ కార్డు.జీఓవీ.ఇన్(www.swavlambancard.gov.in) అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో దివ్యాంగులు నేరుగా ఇంటివద్ద నుంచే ఫోన్, ఇంటర్‌నెట్ సెంటర్, మీసేవా కేంద్రాల నుంచి కార్డుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సులభతరంగా సేవలు

కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన యూడీఐడీ పోర్టల్ వల్ల సేవలు చాలా సులభతరం కానున్నాయి. ఇకపై సదరం శిబిరాల కోసం మీ సేవతో పాటు యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు సంబంధించి ఎప్పుడు హాజరు కావాలనే సమాచారం దివ్యాంగుల ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో ఎలాంటి తప్పులు, అక్షరదోషాలు లేకుండా చూసుకోవాలి. ఇప్పటివరకు ఐదు రకాల వైకల్యం ఉన్నవారికి మీ సేవ ద్వారా సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ఇక యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల వైకల్యాలను చేర్చారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు కూడా సదరం శిబిరాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. సదరం శిబిరంలో వైకల్య నిర్ధారణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లను స్మార్ట్‌కార్డ్ రూపంలో పోస్టల్‌శాఖ ద్వారా ఇంటికే పంపించనున్నారు. ఈ కార్డు ద్వారా చేయూత పింఛన్లతోపాటు ఇతర పలు సంక్షేమ ప్రయోజనాలకు దేశవ్యాప్తంగా చెల్లుబాటు కానుంది. యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డులను ఆన్‌లైన్ నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. ఇప్పటివరకు ఉన్న సదరం సర్టిఫికెట్లు మన రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అయ్యేవి.



యూడీఐడీ కార్డు వెబ్‌సైట్ పేజీ

ఇలా దరఖాస్తు చేసుకోండి

ఆన్‌లైన్‌లో స్వావలంబన్ కార్డ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అప్లయ్ బటన్‌పై క్లిక్ చేసి దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి కొన్ని సూచనలు ఉంటాయి. వాటిని పూర్తిగా చదివి అర్థం చేసుకొని తరువాత అంగీకరిస్తూ సబ్‌మిట్ క్లిక్‌చేస్తే దరఖాస్తు ఓపెన్ అవుతుంది. దివ్యాంగులు వారికి చెందిన పూర్తి సమాచారాన్ని అక్కడ అడిగిన విధంగా నమోదు చేస్తే దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. వైద్య పరీక్షల అనంతరం వెబ్‌సైట్‌లో అర్జీల స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకోవచ్చు.

పోషణతోపాటు విద్య

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణతో పాటు పిల్లలకు ఆటలతో కూడిన విద్యను అందించాలని సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి అన్నారు. చిత్తూరు నగరంలో సోమవారం అర్బన్, రూరల్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. పిల్లల ప్రేరణ, పోషణ, విద్య తదితర అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, రాజేశ్వరి, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

16 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి రూ.1.6 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 16 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.60 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలి

బంగారుపాళెం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యనందించాలని బంగారుపాళెం ఐసీడీఎస్ సీడీపీఓ వాణిశ్రీదేవి అన్నారు. మండలంలోని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బంగారుపాళెం, తుంబకుప్పం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ-పడాయి బీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీడీపీఓ మాట్లాడుతూ, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను కచ్చితంగా నేర్పించాలన్నారు. ఆట ఆధారిత బోధన ద్వారా చిన్నారులు చెప్పే అంశాలను త్వరగా నేర్చుకుంటారన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను తప్పకుండా పిల్లలకు నేర్పించాలని చెప్పారు. సూపర్‌వైజర్లు జయశ్రీ, రెడ్డికల్యాణి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.



మాట్లాడుతున్న సీడీపీఓ వాణిశ్రీదేవి

స్టాండింగ్ కమిటీలో పలు తీర్మానాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ పాలకవర్గం తీర్మానం చేసింది. మేయర్ అముద అధ్యక్షతన నిర్వహించిన మంగళవారం సమావేశంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, సభ్యులు నిర్మల, శశికుమార్, సుష్మ, అశోక్ పాల్గొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరించిన బడ్జెట్ అంచనాలు, 2025-26 సంవత్సర అంచనాల బడ్జెట్‌ను ఆమోదిస్తూ సర్వసభ్య సమావేశానికి పంపడానికి తీర్మానించారు. ఫారెస్టు రోడ్డు - వేలూరు రోడ్డు మధ్య బీటీ.రోడ్డు నిర్మాణాలకు అంచనాలు రూపొందించడం, కూరగాయల మార్కెట్ గేటు టెండరు దక్కించుకున్న మౌనికుమార్‌కు ఏడాది పాటు అనుమతి ఇస్తూ కమిటీ తీర్మానించింది.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్, కమిషనర్

కార్పొరేషన్‌కు సంబంధించిన వాణిజ్య సముదాయాల్లో ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెకు ఇస్తూ ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఇంటి వద్దే వైద్యం



కుప్పిగానిపల్లెలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత



వెప్పాలమానుచేనులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా, సమయం వృథా కాకుండా ఇంటివద్దే వైద్య సేవలు అందుతున్నాయని గుడిపాల, బొమ్మసముద్రం డాక్టర్లు సంధ్య, రష్మిత అన్నారు. మండలంలోని వెప్పాలమానుచేను, కుప్పిగానిపల్లె గ్రామాల్లో మంగళవారం వైద్యసేవలు అందజేశారు. ముందుగా శిబిరం ఏర్పాటుచేసి ఓపీ సేవలు అందించారు. 95 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎస్టీ జనాభా ఉన్న గ్రామాల్లో అస్తమా, ఉబ్బసం ఉన్న రోగులకు స్క్రీనింగ్, స్పిరోమెట్రి టెస్ట్‌లను ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, సరళ, శివగామి, అశ్విని, రుక్మిణి, గిరిజ, బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల జాగ్రత్త అవసరం

తవణంపల్లె: వేసవికాలంలో ఎండలు మండుతున్నాయి. ఆరుబయట తిరిగి వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తగా తీసుకోవాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని బాపినాయుడుపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా బయట తిరిగితే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎండాకాలంలో ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలితే వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తవణంపల్లె: గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

మెరుగైన వైద్య సేవలు

యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత ఆశా కార్యకర్తలదే అని మండల వైద్యాధికారి అనిల్ నాయక్ తెలిపారు. ఆయన మంగళవారం గ్రామీణ ఆరోగ్య అధికారి లక్ష్మీనారాయణతో కలిసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు యూనిఫాం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా గ్రామీణ ప్రాంతాల్లో విశేష సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ప్రతి ఏడాది యూనిఫాం అందిస్తోందన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలకు వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం సాయంత్రం వేళ పనులకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. దీనిపై వారికి అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈకేవైసీపై నిర్లక్ష్యం వద్దు

యాదమరి: ప్రజలు ఈకేవైసీపై నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. మండల కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గ్రామ సచివాలయంలో, రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ పథకాలకు దూరమవుతారని చెప్పారు. ఐదేళ్లలోపు చిన్న పిల్లలకు, కొన్ని సాంకేతిక సమస్యల వలన ఆలస్యమవుతోందని చెప్పారు. ఈ నెల 31వతేదీ లోపు పూర్తి చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఈకేవైసీ 82 శాతం పూర్తయిందని ఆయన పేర్కొన్నారు.

దాతల సహకారం ప్రశంసనీయం



పిల్లలకు విద్యాసామగ్రి అందిస్తున్న ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి

తవణంపల్లె: దివ్యాంగుల పిల్లలకు దాతల సహకారం ప్రశంసనీయమని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి అన్నారు. స్థానిక హైస్కూల్లోని భవిత కేంద్రంలో మంగళవారం రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయంతో దివ్యాంగుల పిల్లలు విద్యాసామగ్రి, ఆటల పరికరాలను అందజేశారు. ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి మాట్లాడుతూ భవిత కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగుల పిల్లలకు విద్యా సామగ్రితో పాటు ఆటల పరికరాలు అందించిన రీడ్స్ సంస్థ డైరెక్టర్ స్టీఫెన్‌ను అభినందించారు. దివ్యాంగుల పిల్లలకు ప్రభుత్వం కూడా చేయూతనిస్తున్నట్లు వివరించారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని మండలంలోని దివ్యాంగుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానసికంగా శారీరకంగా బాధపడుతున్న పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా సాధారణ స్థితికి వస్తున్నారని పేర్కొన్నారు. దివ్యాంగుల పిల్లలు ఆటల్లో రాణించడానికి ఉపాధ్యాయులు తగు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శుచి స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ కోదండపాణి మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలోని భవిత కేంద్రాలకు తమ సంస్థ ద్వారా విద్యాసామగ్రి, ఆటల పరికరాలు అందించినట్లు వెల్లడించారు. తమ సంస్థ ద్వారా దివ్యాంగులకు అభివృద్ధికి సహకరిస్తామన్నారు.

అనంతరం దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు వాటర్‌క్యాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహిత విద్యా ఉపాధ్యాయులు దేవేంద్ర, ఢిల్లీ, ఉపాధ్యాయులు విజయకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, సురేంద్రబాబురెడ్డి, భాస్కర్, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దానధర్మాల మాసం రంజాన్

- మసీదుల్లో ప్రత్యేక నమాజులు
- కఠిన ఉపవాస దీక్షల్లో ముస్లింలు

బంగారుపాళెం: ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసం రంజాన్. ఈ మాసాన్ని దానధర్మాల మాసంగా చెబుతారు. ఇస్లాం మత బోధనల ప్రకారం జీవితాన్ని సన్మార్గంలో పెట్టేందుకు శిక్షణ పొందే మాసంగా రంజాన్ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఈ మాసం అనంతరం వచ్చే 11 నెలల్లో సన్మార్గంలో జీవించే విధానాన్ని అలవరుస్తోంది. ఆరాధనల విషయంలో ఇస్లాం నిర్వచనం విభిన్నమైనది. విధిగా చేయవలసిన నమాజ్, రోజా, జకాత్, ఫిత్రా వంటి సత్కార్యాలే కాకుండా, అల్లా ప్రసన్నత కోసం ఖురాన్ పఠనం చేస్తారు. ఖురాన్ చెప్పినట్టు చేసే ప్రతి మంచిపని దైవారాధన కిందకే వస్తుంది.

70 రెట్లు పుణ్యం

రంజాన్ మాసంలో చేసే సత్కార్యాలకు 70 రెట్లు పుణ్యం ఎక్కువగా లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఈ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుందని చెబుతున్నారు. అందుకే ఈ మాసంలో ముస్లింలు అత్యధికంగా దానధర్మాలు చేస్తుంటారు. ఈ మాసంలో నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్ష చేస్తారు. సూర్యోదయానికి ముందు ఆహారం(సహార్)భుజించి దీక్షను చేపడతారు. మళ్లీ సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత కొద్దిపాటి ఆహారాన్ని(ఇఫ్తార్)స్వీకరించి దీక్షను విరమిస్తారు. ఇలా రంజాన్ నెలంతా కఠిన ఉపవాసాలు పాటిస్తారు.

దానధర్మాలు కీలకం

ఇస్లాంలో దానధర్మాలు కీలకమైనవి. తమ వద్ద ఉన్న సంపద నుంచి జకాత్ చెల్లిస్తారు. సంపద విలువలో 2.5 శాతం లెక్కించి, వచ్చే సొమ్మును పేదలకు పంచుతారు. బంగారం, వెండి, నగదు ఇలా వారి వద్ద ఉన్న వాటిపై నిర్ణీత సొమ్మును జకాత్ తీయడం ద్వారా, మిగిలిన సంపద శుద్ధి అయినట్టు భావిస్తారు. ఇది ముస్లింలు ఖచ్చితంగా చేపట్టాల్సిన నియమం. ఈ మాసంలో తప్పనిసరిగా పేదలకు ఇవ్వాల్సిన ఫిత్రా, రంజాన్ నెలంతా చేసే పుణ్యకార్యాలు, ప్రత్యేక ప్రార్థనలు అల్లా వద్ద ఆమోదం పొందాలంటే, ఈద్ నమాజ్ కన్నా ముందుగా ఫిత్రా కచ్చితంగా చెల్లించాలి. ఇంట్లో ఎంత మంది ఉంటే, అందరి పేరిట ఫిత్రా తప్పనిసరిగా ఇవ్వాలి. అప్పుడే పుట్టిన బిడ్డపేరున కూడా ఫిత్రా ఇవ్వాలని ముస్లిం పెద్దలు చెబుతారు.

పేద-ధనిక సమానం

రంజాన్ మాసం పేదలు, ధనికులు మధ్య తారతమ్యాలను చెరిపేస్తుంది. పేద, ధనిక తేడాలేకుండా మసీదుల్లో పక్కపక్కనే నిలబడి నమాజు చేయడం కనిపిస్తుంది. అందుకే పేదలు ధనికులతో సమానంగా పండుగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే జకాత్, ఫిత్రా దానం చేయాలని ఇస్లాంలో తప్పని సరిచేశారు. అందుకే ఈ మాసంలో అధికంగా దానధర్మాలు చేస్తూ, ఖర్చుకు ఏమాత్రం వెనుకాడరు. అప్పు చేసి దానధర్మాలు చేయడం ఇస్లాంలో సమ్మతించలేదు. ముస్లిం దేశాల్లో జకాత్ వసూలు ప్రభుత్వ పరంగా జరుగుతుంది. కొన్ని స్వతంత్ర సంస్థలు ప్రభుత్వ పర్యవేక్షణలో కార్యక్రమాలు చేస్తుంటాయి.



బంగారుపాళెం జామియా మసీదులో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

దానంతో పుణ్యఫలం

రంజాన్ మాసంలో రూపాయి దానం చేస్తే రూ 70 ధానం చేసినంత పుణ్యం లభిస్తుంది. అర్హుడైన ప్రతి ముస్లిం జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. తను ఉన్న ఇల్లు కాక, ఇతరమార్గాల్లో వచ్చే ఆదాయం, సంపదలో 2.5 శాతం జకాత్ చెల్లించాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగ చేసుకోవడానికే ఈ జకాత్, ఫిత్రా చెల్లించాలి.

\- ఖాజీ, ఖిజర్ మిస్బాహి

ఫిత్రా దానం చేయాలి

ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు వెళ్లే ముందు ప్రతి ముస్లిం తన పేరిట పేదలకు ఫిత్రా దానం చేయాలి. కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరి పేరున ఫిత్రా కచ్చితంగా దానం చేయాలి.

\- నూర్‌అహ్మద్, ముతవల్లి, జామియా మసీదు, బంగారుపాళెం

పోషకాహార లోపాన్ని అధిగమిద్దాం



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

ఐరాల: నవచేతన్ ఆధార్ షీలా కార్యక్రమం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు చేపట్టాలని సీడీపీఓ నిర్మల సూచించారు. పాలకల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ బీ- పడాయ్ బీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో రోజు శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లి పోషణ, బిడ్డ పుట్టినప్పటి నుంచి మూడేళ్లలోపు తీసుకునే చర్యలను తెలియజేశారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు ఇచ్చే ఆధార్ షీలా ద్వారా నెలల్లో 25 రోజులు పోషకాహారం అందేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందులో భాగంగా బ్యాలెన్స్‌డ్ డైట్, చిరుధాన్యాలు, సీజనల్ ఫ్రూట్స్, ఆకు కూరలు, కూరగాయలు, సూక్ష్మ పోషక లోపాలు తగ్గించడం, విటమిన్-ఏ లోపం, ఐరన్ లోపం, విటమిన్- డీ లోపం, అయోడిన్ లోపం వీటిని తగ్గించి సాధారణ పరిస్థితికి తీసుకురావడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. పుట్టిన వెంటనే బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెంచడానికి తల్లి ముర్రుపాలు తాగించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంజుల, లావణ్య పాల్గొన్నారు.